క్లుప్తంగా

టూటౌన్ ఎస్‌ఐగా గాయత్రి



మదనపల్లె : మదనపల్లె టూటౌన్ ఎస్‌ఐగా ఎస్.గాయత్రి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ములకలచెరువులో పనిచేస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండో ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రవికుమార్ పీటీఎంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గాయత్రి మాట్లాడుతూ...శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని చెప్పారు.

జెడ్పీహైస్కూల్లో రికార్డులు తనిఖీ

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలోని తెలుగు జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం డీఈఓ సుబ్రమణ్యం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయుల విద్యా బోధన తీరు, మధ్యాహ్న భోజనం అమలు విధానంపై విద్యార్థులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్, హెచ్ఎం అపర్ణదేవి తదితరులు ఉన్నారు.

10న చెరువు చేపల వేలం

మదనపల్లె : మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి కోమటివానిచెరువులో చేపలు పట్టుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఫిషరీష్ డిపార్ట్‌మెంట్ అధికారులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఫిషరీష్ కార్యాలయం వారు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 10వతేదీ మంగళవారం గొల్లపల్లె రింగ్‌రోడ్డు మీసేవ పక్కన ఉన్నటువంటి ఎస్‌బీఐ కాలనీ సచివాలయంలో వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనవచ్చన్నారు.

రక్తదానం

పీలేరు రూరల్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగవేణి తెలిపారు. శుక్రవారం స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిబిరంలో 12 యూనిట్లు రక్తం సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ వెంకటనాగరాజ, ఆర్ఎంవో డాక్టర్ సరస్వతి, టెక్నీషియన్ మునాఫ్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

108 పైలట్ మృతికి సంతాపం

మదనపల్లె : గువ్వలచెరువు ఘాట్‌లో గురువారం రాత్రి 108 అంబులెన్స్ బ్రేక్‌ఫెయిల్ యాక్సిడెంట్ ఘటనలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయిన పైలట్ రమేష్‌బాబు మృతికి జిల్లా 108 వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి జశ్వంత్, సెక్రటరీలు చలపతి, మదనపల్లె డివిజన్ సూపర్‌వైజర్ నాగభూషణం సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం కడప రిమ్స్ హాస్పిటల్‌కు చేరుకుని రమేష్‌బాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అసోసియేషన్ తరపున రూ.40వేలు, మదనపల్లె డివిజన్ సూపర్‌వైజర్ నాగభూషణం వ్యక్తిగతంగా రూ.5వేలు, 108 కంపెనీ మృతుడి దహనక్రియలకు మంజూరు చేసిన రూ.15వేలు ...మొత్తం కలిపి రూ.60 వేల ఆర్థిక సహాయాన్ని రమేష్ బాబు భార్య అనూషకు అందజేశారు.

ముగిసిన పాలిటెక్ ఫెస్ట్‌-2024

కలికిరి : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన రీజనల్ పాలిటెక్ ఫెస్ట్-2024 శుక్రవారంతో ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ ప్రయోగాలను పరిశీలించిన అధ్యాపకులు ఉత్తమ ప్రదర్శనలు తయారు చేసిన మొదటి ఇద్దరు విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి రూ.25వేలు, రెండవ బహుమతి రూ.20వేలు అందచేశారు. కార్యక్రమంలో జేఎన్టీయూ ప్రొఫెసర్ డా.జీవీ నగేష్, డీఈఈ పి.కరీముల్లా, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయ అభివృద్ధికి చర్యలు

మదనపల్లె సిటీ : జవహర్ నవోదయ విద్యాలయాభివృద్ధికి చర్యలు తీసుకుంటానని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. శుక్రవారం చిత్తూరు రోడ్డు వలసపల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ (వీఎంసీ) సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నామినీగా మదనపల్లె సబ్ కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేలాయుధన్ విద్యాలయ అభివృద్ధి గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తాగునీటి కోసం బోరు, అదనపు ఆర్‌ఓ ప్లాంట్ మంజూరు చేయాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యాలయ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, విద్యా,ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ

రామసముద్రం : మండలంలోని కురిజల గ్రామంలో శుక్రవారం పురాతన చెన్నరాయ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామస్తులు, ఆలయ అర్చకులు కులశేఖర్ బట్టర్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులను వేద మంత్రాలతో, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయం పునర్నిర్మాణం చేపట్టడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు.

• అడుగడుగునా గుంతలే..



పీలేరు పట్టణంలో రోడ్లన్నీ గుంతలమయం కావడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో ఆర్‌ఆర్ రెసిడెన్సీ ప్రాంతంలో, పుట్టగడ్డ, కోటపల్లె క్రాస్ ప్రాంతంలో, ఎల్‌బీఎస్ రోడ్డులోని పంచాయతీ మిట్ట ప్రాంతంలో గుంతలు ఏర్పడి వాహనాలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే మదనపల్లె రోడ్డు, సాయిబాబా గుడి రోడ్డు, పాత బస్టాండు ఎటు చూసినా అన్ని ప్రాంతాల్లో రోడ్లు మధ్యలో గుంతలు దర్శమిస్తున్నాయి. ఈ గుంతలో వాహన చోదకులు ప్రమాదాలకు గురవతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - పీలేరు

• ఎవరికీ పట్టని గొయ్యి

బి.కొత్తకోట-శంకరాపురం రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గొయ్యిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. హంద్రీ-నీవా కాలువపై నిర్మించిన బ్రిడ్జి అంచున పెద్ద గొయ్యి ఏర్పడింది. శంకరాపురం వైపు నుంచి బి.కొత్తకోటకు వచ్చే వాహనాలు, బైక్‌పై వచ్చే వాళ్లు అదుపుతప్పినా, గొయ్యిని చూసుకోకుండా అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదు. ఈ గొయ్యిని పూడ్చేందుకు రహదారి భవనాలశాఖ కనీసం పట్టించుకోవడం లేదు. స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకుని గొయ్యిని పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - బి.కొత్తకోట



భూసమస్యల పరిష్కారానికే సదస్సులు

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మదనపల్లె : రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



పెద్దమండ్యం : సదస్సులో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్



బి.కొత్తకోట : కంబాలపల్లెలో ప్రభుత్వ భూమి పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్



పెద్దతిప్పసముద్రం : అర్జీదారునికి రశీదు అందజేస్తున్న డీఈఓ, తహసీల్దార్



పీలేరు : ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి రమ

మదనపల్లె : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తవారిపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సర్పంచ్ బోర్‌వెల్ మహేష్, నోడల్ ఆఫీసర్, డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి, అడిషనల్ నోడల్ ఆఫీసర్ రాఘవేంద్ర, తహసీల్దార్ ఖాజాబీ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు సమర్పించారు. చిలకవారిపల్లెకు వంద ఏళ్లుగా దారి సమస్య ఉందని, తమ సమస్యను పరిష్కరించి చిలకవారిపల్లెకు దారి వేయించాల్సిందిగా గ్రామస్థులు సర్పంచ్ మహేష్‌తో కలిసి అధికారులకు అర్జీ సమర్పించారు.

అన్ని సమస్యలకు పరిష్కారం

బి.కొత్తకోట : రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అందే అన్నిరకాల ఫిర్యాదులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. శుక్రవారం మండలంలోని బీరంగి గ్రామం శంకరాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సును ఆయన తనిఖీ చేశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారితో మాట్లాడారు. ఇతరా శాఖల ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూకు సంబంధించిన సమస్యలపై ఒక్కరోజులో లేదా వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. తర్వాత కంబాలపల్లె సమీపంలో బి.కొత్తకోట సహకార సంఘం కోసం నిర్మించనున్న గోదాముకు కేటాయించాల్సిన ప్రభుత్వ భూమిని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహ్మద్ అన్సారీ, ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ శంకరయ్య, సర్పంచులు వెంకటరమణ, గిరిజ రఘునాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : రెవెన్యూ సదస్సులో ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీకి ఆన్‌లైన్ రశీదు తీసుకోవాలని నోడల్ అధికారి (డీఈఓ) సుబ్రమణ్యం, తహసీల్దార్ శ్రీరాములు నాయక్ ప్రజలకు సూచించారు. శుక్రవారం మండలంలోని అమళ్ళబండకోటలో జరిగిన రెవెన్యూ సదస్సులో మొత్తం 17 అర్జీలు రాగా ఇందులో భూ సమస్యలకు సంభంధించి 11, వేరే శాఖలకు సంభంధించి 6 అర్జీలు వచ్చాయి. అనంతరం స్థానికంగా ఉండే స్మశానానికి, గొడుగువారిపల్లికి దారి సౌకర్యం కల్పించాలని ప్రజలు అధికారులను కోరారు. సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, ఎంఈఓ నారాయణ, ఆర్‌ఐ బాలాజీ, వీఆర్వో నరేంద్రతో పాటు సచివాలయ, అటవీ, ఐసీడీఎస్, సబ్ రిజిస్ట్రార్ శాఖలకు అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

పెద్దమండ్యం : రైతులు ఎదుర్కొంటున్న భూమి సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి, జిల్లా హౌసింగ్ పీడీ సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని వెలిగల్లు గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ సి సరస్వతి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. భూ సర్వే, సర్వే నెంబర్ అడిషన్, ఆన్‌లైన్‌లో పొరబాట్లు, భూమి ఆన్‌లైన్ కోసం 86 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఆర్‌ఐ రమేష్, వీఆర్వో శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె : మండలంలో భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తున్నట్లు నోడల్ ఆఫీసర్ మధుసూధన్ తెలిపారు. శుక్రవారం ఎద్దులవారిపల్లె గ్రామ సచివాలయం వద్ద రెవిన్యూ గ్రామ సదస్సు జరిగింది. రెవెన్యూకు సంబంధించి రైతుల నుంచి 5 అర్జీలు,పెన్షన్‌ల కోసం 11 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ ఉదయకిరణ్‌రెడ్డి, ఫారెస్టు బీట్ ఆఫీసర్ రామరాజ్, మండల సర్వేయర్ నరేంద్ర, డీటీ రవి, ఆర్‌ఐ ముద్దుక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు ప్రాధాన్యత

పీలేరు రూరల్ : భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభల్లో అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. రమా అన్నారు. శుక్రవారం మండలంలోని మేళ్లచెరువు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ భూమి, ఇతర సమస్యలు ఏవి ఉన్నా అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 103 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఇందులో 77 భూ సమస్యలపై, 26 ఇతర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ భరత్‌కుమార్, తహశీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు, డీటీ సుబ్రమణ్యం, సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వోలు కదిరప్ప, సర్పంచ్ చిన్నకొండయ్యనాయుడు పాల్గొన్నారు.

వ్యవసాయం చేస్తున్నా భూ రికార్డులు లేవు

కలకడ : ఐదు దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్న సాగుభూములు రెవెన్యూ రికార్డులలో లేవని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని కదిరాయచెర్వు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పనికుమార్ దృష్టికి రైతులు అనేక సమస్యలను తీసుకువచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రామసముద్రం : రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి శివరామమూర్తి తెలిపారు. శుక్రవారం రామసముద్రం సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరయ్యారు. రెవెన్యూ సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలన్నారు. తహసీల్దార్ నిర్మలాదేవి, సర్వేయర్ నాగరాజు, వీఆర్వోలు రామచంద్ర, రెహమాన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

నిమ్మనపల్లె : రైతుల భూ సమస్యలపై ప్రతి అర్జీనీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే షాజహాన్ బాష అన్నారు. శుక్రవారం వెంగంవారిపల్లె గ్రామంలో ప్రత్యేక అధికారి డీపీఓ బాలకష్ణారెడ్డి, తహసీల్దార్ ధనంజయలు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి, సర్పంచ్ శ్రీవాణి, నాయకులు, మల్లికార్జున, రాజన్న, వెంకటరమణ పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణ దార్శనికుడు అంబేడ్కర్

68వ వర్ధంతికి ఘన నివాళులు



మదనపల్లెలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నిసార్‌అహ్మద్ తదితరులు



నివాళులర్పిస్తున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెలగౌతమ్‌కుమార్



పీలేరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



వాల్మీకిపురంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల తదితరులు

మదనపల్లె : సమసమాజ నిర్మాణ దార్శనికుడు అంబేడ్కర్ అని, ఆయన దేశానికి అందించిన సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి నిసార్‌అహ్మద్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, చరణ్, కొత్తపల్లె మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్

భారతదేశం ప్రపంచంలోనే అత్యున్నతమైనదిగా ఎదిగేందుకు ప్రధాన కారణం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమేనని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని దిగువకమ్మపల్లె అంబేడ్కర్‌నగర్‌లో బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు, మండలంలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఓబులేషు అధ్యక్షతన జరిగిన వర్ధంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో..

స్థానిక కాలనీగేట్ వద్ద భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) వ్యవస్థాపకులు పీటీఎం.శివప్రసాద్ , బహుజన్ సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెలగౌతమ్‌కుమార్, మాలమహానాడు జాతీయనాయకులు యమలాసుదర్శనం, వాల్మీకిసంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు తదితరులు అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు.

రామసముద్రం : మండలంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం దళిత నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలమహానాడు మండల అధ్యక్షులు టి.కృష్ణప్ప, నాయకులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు.

పీలేరు : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పీలేరులో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి వివిధ సంఘాల నాయకులు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉన్నతమైన రాజ్యాంగాన్ని మనకు అందించి సమానత్వాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ధరణికుమార్, పాలకుంట శ్రీనివాసులు, సుభాష్, తాతయ్య, గండికోట వెంకటేష్, కృష్ణయ్య, గురునాథ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

కేవీపల్లె : ప్రపంచంలోనే మన దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని ప్రజాసంఘ నాయకులు ముల్లంగి చంద్రయ్య అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద వివిధ సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మల్లికార్జున, వివిధ సంఘాల నాయకులు శేషాద్రి, శ్రీనివాసులు, కిషోర్, మణి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అంబేడ్కర్ ఆశయాలు సాధ్యం

కలికిరి (వాల్మీకిపురం): వైఎస్సార్‌సీపీతో రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్.అంబేడ్కర్ ఆశయ సాధన సాధ్యమవుతుందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వాల్మీకిపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బిఆర్ అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దళితులకు అన్ని విధాలుగా సముచిత స్థానం లభించిందని, కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ప్రతి నిత్యం రాష్ట్రంలో ఏదోఒకచోట దళితులపై దాడులు జరగడం పరిపాటిగా మారిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నీళ్ల భాస్కర్, అబ్దుల్ కలీం, బిడ్డల కేశవరెడ్డి, సుధా, ఇబ్రహీం, ఆనంద, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రవి, గాంధీపేట రఘు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో..

కలికిరి : మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్టీడి హరి ఆధ్వర్యంలో కలికిరి గాంధీ కూడలి వద్ద అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఆయన జాతికి చేసిన సేవలను గుర్తుచేసుకుని ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు సంఘం నేతలు రమేష్, ప్రసాద్, బాలు, దక్కా శ్రీనివాసులు, సహదేవ, బ్యాంకు గుంటి, సహదేవయ్య, గుంటి క్రిష్ణయ్య, చంద్ర, సందీప్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

బి.కొత్తకోట : అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనలతో ముందుకు సాగడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని నగర పంచాయతీ కమిషనర్ పల్లవి అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బాస్ నాయకులు నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఆమె విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. తర్వాత ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి నినాదాలు చేశారు.

పెద్దతిప్పసముద్రం : బాస్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ దళితులకే కాకుండా ప్రజలందరికీ ఆదర్శ ప్రాయుడన్నారు. బాస్ నాయకులు సింగన్న, సచిన్, కాట్నగల్లు రమణ, వెంకటేష్, మాధవ, చెన్నకేశవ, బీసీ నాయకులు మహేష్, ఏబీ సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రంలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యకమాన్ని దళిత నాయకులు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాళలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లికార్జున, సీపీఐ నాయకులు అంజనప్ప, హరినాథ్, మంత్రాల రమణ తదితరులు ఉన్నారు.

తంబళ్లపల్లె : భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సేవలు అజరామమని ఎంఆర్‌పీఎస్ నాయకులు మల్లికార్జున కొనియాడారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పీలేరు రూరల్ : యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కోటపల్లె రోడ్డులో శ్రీ దివ్యయోగ విద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్య యోగా సాధన చేయాలని సూచించారు. శారీరక, మానసిక ఆరోగ్యం, ప్రశాంతత యోగాతో సాధ్యమవుతుందని తెలిపారు. పట్టణ ప్రజలకు అనువుగా యోగ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, యోగా సంస్థ నిర్వాహకులు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మీ, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి, రమణారెడ్డి, లక్ష్మీకర్, శ్రీనాథరెడ్డి, అబ్బవరం అమరనాథరెడ్డి, వీఎస్ఎన్ పాఠశాల చైర్‌పర్సన్ మాధవి తదితరులు పాల్గొన్నారు.



యోగా శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

సేంద్రీయ విధానంలో పండ్ల తోటలు సాగు చేయాలి

కలికిరి : సేంద్రీయ పద్ధతుల్లో కాయకూరలు, పండ్ల తోటలు సాగు చేయాలని బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ కేంద్రం ప్రిన్సిపాల్ టి.హెచ్.సింగ్ అన్నారు. స్థానిక కేవీకే కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా పండించే టమాటా, మామిడి, వంగ, మిరప, బొప్పాయి, దానిమ్మ, అనప, అలసంద, బీన్స్, చిక్కుడు, జామ, సొర, బీర, కాకర, దోస, ఆకు కూరలు తదితర పంటల్లో ఐహెచ్‌ఆర్ రూపొందించిన అధిక దిగుబడినిచ్చే, చీడ పీడలను తట్టుకునే హైబ్రిడ్ విత్తనాల గురించి ఆయన వివరించారు. సేంద్రీయ విధానంలో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం రైతులకు కూరగాయలు, ఆకుకూరల నూతన రకం విత్తనాలు, మామిడి, డ్రాగన్, జామ, అల్లనేరేడు, నిమ్మ తదితర అంటు మొక్కలను రైతులకు ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో కేవీకే కో-ఆర్డినేటర్ డా. మంజుల, ఐఐహెచ్‌ఆర్ సీనియర్ సైంటిస్ట్ డా. అతికుల్ల, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అశోక్ కుమార్‌రెడ్డి, ఉద్యానవన అధికారి సుకుమార్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు డా. శ్రీనివాసులు, పీరూసాహెబ్, నవీన, డా. మాధురి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ టి.హెచ్.సింగ్

దివ్యాంగులను ఆదరించాలి



షాట్‌పుట్ క్రీడల్లో దివ్యాంగ విద్యార్థి

మదనపల్లె సిటీ : దివ్యాంగులను ఆదరించాలని జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి గౌస్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు పాఠశాలలో దివ్యాంగుల దినోత్స వారోత్సవాలను పురస్కరించుకుని దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. చిన్నారులు క్రీడల్లో కూడా రాణించడం అభినందనీయమన్నారు. వీరికి క్రీడలు కూడా నేర్పించాలన్నారు. క్యారమ్ బోర్డు, షార్ట్‌పుట్, చెస్ పోటీలు జరిగాయి. త్వరలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వెలుగు కార్యదర్శి ఉదయమోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.